విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఓటింగ్ శాతం పెంపు దిశగా చర్యలు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓటింగ్ శాతం పెంపొందించే దిశగా వివిధ కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థుల ఓటింగ్ నమోదు ప్రక్రియను చేపట్టనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్ఓ ఛాంబర్లో జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ పురోగతిని విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ సాయంత్రం ముసాయిదా ఓటరు జాబితా రాజకీయ పార్టీలకు సమర్పించనున్నట్టు తెలిపారు. ఈనెల 27వ తేదీ నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్స్ అభ్యంతరాలు స్వీకరణ ఉంటుందని, స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించి ఓటింగ్ శాతాన్ని పెంపొందించే దిశగా కూడా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. డిసెంబర్ 26వ తేదీన క్లెయిమ్స్ అభ్యంతరాలు పరిష్కరిస్తారని ఆయన స్పష్టం చేశారు. 2024 జనవరి 5వ తేదీన తుది జాబితా ప్రచురితమవుతుందన్నారు. జిల్లాకు సరిపడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సమకూర్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి జి.కేశవర్ధనరెడ్డి, తెలుగు దేశం పార్టీ తరఫున అల్లాడి స్వామి నాయుడు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున కుడిపూడి శ్రీను, భారతీయ జనతా పార్టీ తరపున డి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 67 అర్జీలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల నిర్వహణ తీరు పట్ల అర్జీదారులలో విశ్వస నీయతను పెంపొందించే దిశగా పరిష్కార మార్గాలు క్రియాత్మకంగా చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మహారాజా ప్యాలెస్ కళ్యాణ మండపంలో మండల స్థాయి స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్, ఎంపీడీవో నాతి బుజ్జి సుమారుగా 67 అర్జీలను అర్జీదారుల నుండి స్వీక రించారు. వీటిలో ప్రధానంగా సామాజిక భద్రత పింఛన్ల మంజూరు, పౌరస రఫరాలు, వైద్య సహాయం, రీ సర్వే, భూ సమస్యలు, త్రాగు, సాగు నీటి సమస్యలు వివిధ సంక్షేమ పథకాలు లబ్ధి సంబంధించిన సమస్యలు ధ్రువపత్రాలు జారీ ఇతరత్రా సమస్యల పై అందాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్ల

విశాలాంధ్ర - ఆలమూరు : పండించిన పంటను కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుం దని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామంలో రైతు భరోసా కేంద్రం నందు సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన ముందుగా గ్రామ సభ నిర్వహించి, మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన ధాన్యం సేకరణ, తేమ శాతం, అనాలిసిస్ విధానాన్ని సిబ్బందిని అడుగగా ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించవచ్చన్నారు. అనంతరం వారంతా ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఏఎం జనరల్ నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎం.ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజలందరి ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లను గ్రామాలకు పంపించి వైద్యం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వసంత్ కుమార్, తదితర అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్

విశాలాంధ్ర - కరప : అమరవీరుల వారోత్సవాలలో భాగంగా కరప పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ ఏర్పాటు చేసినట్టు ఎస్సై నౌడు రామకృష్ణ తెలిపారు. కరప ఎంపీయుపి స్కూల్ నుండి విద్యార్థినీ విద్యార్థులను కరప పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యులుగా చేసి పోలీసుల కర్తవ్యాలను, చట్టం పనితీరును విద్యార్థులకు తెలియజేస్తూ అవగాహన కల్పించామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని చట్టాన్ని అందరూ గౌరవించాలని విద్యార్థులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసన్నకుమార్, ఏఎస్ఐ సూరిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

మండపేటలో విషాదం

విశాలాంధ్ర - మండపేట : లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ బాలుడు దుర్మరణం పాలైన సంఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో చోటుచేసుకుంది. స్థానికంగా శుక్రవారం ఉదయం బాలుడు తన సైకిల్ పై బడికి వెళ్తుండగా మృత్యువు లారీ రూపంలో వెంటాడి కబళించింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు 30వ వార్డు సంఘం కాలనీకి చెందిన కోనె మహేష్ సర్దార్ వేగుళ్ళ వీర్రాజు మున్సిపల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రతి రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం మహేష్ సైకిల్ పై ఇంటి నుంచి పాఠశాలకు బయలు దేరాడు. బైపాస్ రోడ్డు దాటుకుని సత్యశ్రీ రోడ్డు వైపు వస్తుండగా కోళ్ల ఫారాల వద్ద మలుపు దగ్గరకు వచ్చేసరికి నూకల లోడుతో ఓ లారీ వెనకాలే వస్తూ బాలుణ్ణి ఢీ కొట్టింది. దీంతో బాలుడు సైకిల్ తో సహా లారీ చక్రాల కింద పడి నుజ్జు నుజ్జయి వెంటనే ప్రాణాలు విడిచాడు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం యస్ యానాం గ్రామ జడ్పీ హైస్కూల్లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్-అమలాపురం వారిచే సదస్సు నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు బి. అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కె. లీలా కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని వివాహ వయస్సు రాకుండా ముందుగానే వివాహాలు చేసుకుని చిన్న వయస్సులోనే పిల్లలు పుట్టడంతో శరీరం సహకరించక, పిల్లలను పోషించుకునే అవగాహన లేక ఆడపిల్లలు అనేక బలహీనతలకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. 19 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహాలు చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో అంగన్వాడీ టీచర్స్, ఆశావర్కర్స్, హైస్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

నార్కో సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రధానంగా విద్యా సంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన కలెక్టరేట్‌లో నార్కో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, అడిషనల్ ఎస్పీ పి. శ్రీనివాస్, సెబ్ అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులతో పాటు రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ, ఔషధ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అటవీ, రవాణా తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలుత సెబ్ అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ జిల్లాలో నమోదు చేసిన గంజాయి కేసులు, గంజాయి అక్రమ రవాణాపై నిఘా తదితరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 23వ తేదీ నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు చూస్తే 4 గంజాయి కేసుల్లో 18 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీస్, సెబ్ సమన్వయంతో డ్రగ్స్ అమ్మకాలు, సేవించడానికి అవకాశం వున్న ప్రదేశాలలో తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారులను, కమిటీలను నియమించాలని సూచించారు. రైల్వే స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా కాకినాడ జిల్లాను మార్చేందుకు పోలీసు శాఖ చేస్తున్న కృషి మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడిం చారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి. శ్రీనివాస్‌బీ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. సుమలత, కాకినాడ, పెద్దాపురం డీఎస్పీలు కె. మురళీకృష్ణారెడ్డి, కె. లతాకుమారి, డీపీఈవో ప్రసాదరావు తదితరులు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - అయినవిల్లి : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రెండు లక్షల ఆరు వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం పంపిణీ చేశారు. వీరవల్లిపాలెంకు చెందిన రెడ్డి ఈశ్వర పరస రాముడుకు రూ.లక్ష, కొరపు రాధకు రూ.30 వేలు, నల్లచెరువుకు చెందిన చప్పిడి భాగ్యలక్ష్మికి రూ.26 వేలు, నేదునూరుకు చెందిన కుంచే హైమావతికి రూ.22 వేలు, వెలువల పల్లికి చెందిన అందే వీరభద్రుడుకి రూ.16 వేలు, చల్లా వెంకటలక్ష్మికి రూ.12 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టపర్తి పండు, సొసైటీ ప్రెసిడెంట్ మట్టపర్తి రామారావు, వైస్ ఎంపిపి బయ్యా చినబాబు, మండలం వైసిపి అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, సర్పంచ్‌లు గుమ్మడి ప్రసాద్, బొంతు మణి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొంతు రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, కఠారి సిద్ధార్థ రాజు, ఎంపీటీసీ కట్టా వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఓ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యేను చుట్టుముట్టిన మహిళలు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : తమకు ఇళ్ల స్థలాలు కల్పించాలని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబును మత్స్యకార మహిళలు చుట్టుముట్టి నిలదీశారు. యు కొత్తపల్లి మండలం మూలపేట గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక సర్పంచ్ మౌనిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతి గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తుండగా, స్థానిక రామాలయం వాడ బలిజిపేటలో పలువురు మత్స్యకార మహిళలు ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యేని చుట్టుముట్టారు. అర్హులై ఉండి ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని నిలదీశారు. దీంతో స్థానిక సచివాలయ సిబ్బందిని పిలిచి ఇళ్ల స్థలాలు రానివారి పేర్లను తక్షణమే నమోదు చేసుకోవాలని తెలిపారు. మరోచోట గ్రామ వార్డు మెంబర్‌గా నెగ్గిన మాకు, వాలంటీర్‌కు ఉన్న అంత విలువ కూడా లేదని వాలంటీర్ కే అన్ని అప్పగించారని మహిళ వార్డ్ మెంబర్ ఎమ్మెల్యే పై మండిపడ్డారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి నాయకులకు వైయస్సార్ పార్టీలో ఎప్పుడు విలువ ఉంటుందని అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల చేసిన మార్పులు చేర్పులతో సహా ఓటర్ల జాబితాలను బూత్‌ల వారి ప్రచురణ కార్యక్రమాన్ని చేపట్టామని తాళ్ళపూడి మండల తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రాధిక తెలిపారు. ఈ నెల 27 నుండి డిసెంబర్ 9 వరకు ఈ జాబితాలను ఓటర్లు పరిశీలించుకుని అవసరమైన వారు చేర్పులు, మార్పులు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఓట్ల నమోదుకు నవంబర్ 4,5 మరియు డిసెంబర్ 2,3 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవ్వరూ అశ్రద్ధ చేయకుండా కుటుంబ సభ్యుల ఓట్లు కూడా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని, ఓటు లేకుంటే ఎందుకులే అని అశ్రద్ధ చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని, ఓటు చాలా విలువైనదని పేర్కొన్నారు.

వినయ్, రామారావులకు సత్కారం

విశాలాంధ్ర - మండపేట : ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడల్లో రాణించి పతకాలు సాధించిన పట్టణానికి చెందిన విద్యార్థులు వినయ్, రామారావులను కాపు రామాలయ కమిటీ చిరు సత్కారం చేసింది. సైదిల్ పేట మెయిన్ రోడ్డులో ఉన్న తూర్పు కాపుల రామాలయం వద్ద గురువారం రాత్రి కమిటీ పెద్ద జొన్నపల్లి సూర్యారావు అధ్యక్షతన ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. తూర్పు కాపు సంఘం ప్రెసిడెంట్ దాసరి సత్యనారాయణ, పెద్దలు ముక్కా దాలయ్య, జొన్నపల్లి సత్తిబాబు, జొన్నపల్లి సూర్యారావులు ఇరువురికీ పూల మాలలు వేసి దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. విజయ లక్ష్మి ఫైనాన్స్ తరపున అధినేతలు కర్రి రామారావు, లంక రమ ణబు పూల మాలల వేసి అభినందనలు తెలిపి వారికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంఘం, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

లక్ష్మీవాడ గ్రామ నివాసి అయిన **మోరంపూడి ఏడుకొండలు, తండ్రి రామకృష్ణ** అను నేను నా **పాస్‌పోర్ట్ నెం. N9545179**ను జిరాక్స్ తీసుకొనుటకు ఇంటిదగ్గర నుండి కాత్రేనికోన గేట్ సెంటర్‌కు వెళ్లినపుడు మార్గమధ్యలో జారి పడిపోయినది. దొరికినవారు తెలియజేయగలరు.

మోరంపూడి ఏడుకొండలు
తండ్రి రామకృష్ణ
లక్ష్మీవాడ, సెల్ : 9704023993

బాధితులకు సత్వర సహాయానికి చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి సత్వరం సహాయం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తొలుత జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి డీవీ రమణమూర్తి.. గత సమావేశంలో చర్చించిన అంశాలపై కార్యాచరణను వివరించారు. అనంతరం జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసులు, వాటి విచారణలో పురోగతి, బాధితులకు పరిహారం పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గత సమావేశంలో సభ్యులు సూచించిన కేసులు తోపాటు పాత కేసులకు సంబంధించి పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. 2020-23 కేసులకు సంబంధించి ఈ నెల 13వ తేదీ వరకు చూస్తే బాధితులకు చట్టం పరిధిలో రూ.31.37 లక్షల పరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వరం న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషిచేస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన విచారణ పూర్తిచేసి ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2020నుంచి ఇప్పటి వరకు చూస్తే ప్రస్తుతం 19 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ)లో ఉన్నాయన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : ఏఐటియూసి 105 ఆవిర్భావ దినోత్సవం అక్టోబర్ 31 జిల్లా అంతటా ఘనంగా నిర్వహించాలని ఎఐటీయుసి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె. సత్తిబాబు పిలుపు నిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశం జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన అమలాపురం శ్రీ వేంకటేశ్వర ప్లాజాలో నిర్వహించారు. సమావేశానికి సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సమావేశాన్ని ఆంధ్ర ఆటో వాలా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్ ప్రారంభించి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మధ్య కాలంలో అమరులైన మందపల్లి ప్రేమావతి, చేనేత కార్మిక సంఘం నాయకులు పిచ్చుక సూర్యారావుకి సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది. కౌన్సిల్ సమావేశానికి జిల్లా కో కన్వీనర్ జి. చిరంజీవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఉండవల్లి గోపాలరావు, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, సంపర పద్మ మల్లారపు సత్యనారా యణలు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు బొలిశెట్టి గౌరీ శంకర్, ఐలా జిల్లా కన్వీనర్, కో కన్వీనర్‌లు బాలకృష్ణ, సురేష్‌లు, హాజర అయ్యారు. సత్తిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి భారత కార్మిక వర్గం సమస్యలపైన ఏఐటీయూసి పనిచేస్తూ ఉందని స్వతంత్ర సంగ్రామంలో ఇండియన్ వర్కింగ్ క్లాస్ చారిత్రాత్మక పాత్రను పోషించిందన్నారు. అక్టోబర్ 31న 105వ వసంతంలో అడుగిడుతున్న విప్లవ కర కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అంతటా అరుణ పతాకాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అధ్యక్షులు పలు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు.

అందరి ఆరోగ్యం జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర -నిడదవోలు : రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా ఉండాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిడదవోలు శాసన సభ్యులు జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. నిడదవోలు మండలం కంసాలిపాలెం లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగిస్తూ, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా రన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ప్రతి పౌరుడికి ఇంటి వద్దనే సీనియర్ వైద్యులతో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, ఎంపిపి తిరుమళ్ళ భాగ్యలక్ష్మి, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి మలిశెట్టి వీరప్రసాద్,గ్రామ వైసిపి అధ్యక్షులు బెజవాడ గంగాధర్, ఉప్పాటి వెంకటేష్, రాపోలు వెంకటేశ్వరరావు, నక్క సూర్యనారాయణ, కోయి చిన్న, వైసీపీ నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సంబరాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు గత 32 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నది. చెకుముకి 2023 చెకుముకి సైన్స్ సంబరాలు గోడపత్రి కను కాకినాడ ఆర్‌జెడి జి. నాగమణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అన్ని పాఠశాలలు ఈ సైన్స్ సంబరాలు జయప్రదం కావడానికి సహకరించాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుటకు సహకరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఈ పరీక్ష జూనియర్ (6,7 తరగతులకు), సీనియర్స్ (8,9,10) స్థాయిల్లో పాఠశాల స్థాయి నవంబరు 10వ తేదిన జరుగును. మండల స్థాయి నవంబరు 30 నా జరుగును. జిల్లా స్థాయి డిసెంబరు 17న కిర్లంపూడి నందు జరుగును. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సియంఓ మరియు ఐఈ కో -ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక (ఆం. ప్ర) కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎమ్ఎమ్ ఆర్ ప్రసాద్, వి శ్రీరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పెద్దిరెడ్డి శివ గణేష్ నియమితులయ్యారు. గతంలో ఎస్ఐగా ఈయన అనపర్తిలో విధులు నిర్వర్తిం చారు. ఇప్పటివరకు సిఐగా విధులు నిర్వహించిన విప్పర్ల శ్రీనివాస్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సంద ర్భంగా సిఐగా బాధ్యతలు చేపట్టిన శివ గణేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఇటీవల కాలంలో సులభంగా సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ తన ధ్యేయమని సిఐ శివ గణేష్ చెప్పారు.

మోడల్ నియోజకవర్గంగా నిడదవోలు అభివృద్ధి

విశాలాంధ్ర - నిడదవోలు : మోడల్ నియోజకవర్గంగా నిడదవోలు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని నిడదవోలు శాసనసభ్యులు జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. పట్టణంలోని 22 వార్డులో రెండు కోట్ల ఐదు లక్షలతో నిర్మించనున్న మలవ్యర్థ శుద్ధీకరణ ప్లాంటుకు శ్రీనివాస్ నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేయడం వల్ల అది కొండలా పెరిగిపోయి వాటి నుండి వచ్చే దుర్గంధంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మూడు కోట్ల 50 లక్షలతో చెత్తను రీసైక్లింగ్ చేయడం ద్వారా దానిని అరికట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ పద్మావతి, వైస్ చైర్మన్ యలగడ బాలరాజు, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ,పీ.రతిదేవి, గుర్రం శాంతి శ్రీ,యు. జాన్ బాబు,ఎండీ షకీరా బేగం, వైసిపి జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫనింద్ర తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-దేవరపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు వెల్లడించారు దేవరపల్లి మండలం దుద్దుకూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో దుర్గారావు పాల్గొన్నారు. సర్పంచి బొంత నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పథకంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని దీంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పొట్టి స్వర్ణలత, సర్పంచ్ బొంత నాగమణి, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోష్పాద క్షేత్రంలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన కొవ్వూరు మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం జరిగింది. రివర్ కన్జర్వేటివ్ యాక్ట్ చట్టాన్ని ఉల్లంఘించి నది ఒడ్డున అక్రమ కట్టడాలు కడుతున్నారని బిజెపి కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, టిడిపి కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చారు.

జిల్లా రెవెన్యూ అధికారిని కలిసిన డీసీసీ అధ్యక్షురాలు

విశాలాంధ్ర-కొవ్వూరు : జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జి. నరసింహులును తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ్ కుమారి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అధికారులతో సమన్వయం చేసుకొని సహకరిస్తామని ఆమె పేర్కొన్నారు.

జగన్ చేస్తున్నది బస్సు యాత్ర కాదు ప్రజలపై దండయాత్ర

విశాలాంధ్ర-కొవ్వూరు : జగన్ ప్రభుత్వం చేస్తున్నది బస్సు యాత్ర కాదని దండయాత్ర అని మాజీ మంత్రి జవహర్ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏం అభివృద్ధి చేసిందని యాత్ర చేస్తున్నారని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల ప్రజా సంక్షేమాన్ని మరచిన వైసీపీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సామాజిక సాధికారత గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళిత ద్రోహి అన్నారు. దళితుల ప్రాణాలు తీసిన వారు, దళితులపై దాడులకు పాల్పడిన వారికి సామాజిక సాధికారత బస్సు యాత్ర చేసే అర్హత లేదని మాజీమంత్రి కేఎస్ జవహర్ మండిపడ్డారు.

18న మాదిగల విశ్వరూప మహాసభ

విశాలాంధ్ర - కొవ్వూరు : మాదిగల ఆకాంక్ష ఏబిసిడి వర్గీకరణ అనుగుణంగా హైదరాబాదులో నవంబర్ 18వ తేదీన నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు అందరూ రావాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. కొవ్వూరు ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మహాసభకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ రానున్నారని తెలిపారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మాదిగ జాతి కులాలకు అన్యాయం చేసిందని అన్నారు. సామాజికంగా సాంప్రదాయ పద్ధతిగా ఉద్యమం చేస్తుంటే ఏ రాజకీయ పార్టీ కూడా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గెల్లా నటరాజన్, బంటుపల్లి బాలు, పోసపల్లి వెంకట్రావు మాదిగ. గెడ్డం వినోద్. భీమడోలు కిరణ్ కుమార్. దాన్ సూరి, ముప్పిడి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి ఎస్ఐగా సురేష్ బాబు

విశాలాంధ్ర - అయినవిల్లి : అయినవిల్లి ఎస్ఐగా కె. సురేష్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం స్పెషల్ బ్రాంచి నుండి అయినవిల్లి పోలీస్ స్టేషన్‌కు రాగా, ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఎస్. నాగేశ్వరరావు కాత్రేనికోన బదిలీ అయ్యారు. త్వరలో సిఐ ప్రశాంత్ కుమార్ కూడా బదిలీ కానున్నట్టు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన బైక్ ప్రమాదంలో రాజోలు ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న మలికిపురం మండలం రామరాజు లంక గ్రామానికి చెందిన ఈద ఎజ్రా శాస్త్రి మృతి చెందాడు. శుక్రవారం మృతదేహానికి రాజోలు ఆసుపత్రి సిబ్బందితో కలిసి రాజోలు శాసనసభ్యులు రాపాక వరప్రసాద్ రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజోలు వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - నిడమర్రు: దేవీ నవరాత్రులు పురస్కరించుకుని నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామంలో దేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా శుక్రవారం గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారధన కార్యక్రమంలో జనసేన నాయకులు ధర్మరాజు పాల్గొన్నారు. కనకదుర్గ అమ్మ వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వంగ రఘు, గ్రామ పెద్దలు, గ్రామ జనసైని కులు, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

విశాలాంధ్ర-మండవల్లి: భ్రమరాంభాసమేత మల్లేశ్వరస్వామి వారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అకాంక్షించారు. మండవల్లి గ్రామంలోని శివాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా ఆలయ సన్నిధిలో అఖండ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనలో భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు,స్దానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

విశాలాంధ్ర-మండవల్లి: సురక్షితమైన తాగునీటిని పౌరులందరికి అందిం చేందుకు చర్యలు చేపడుతున్నామని తాగునీటి చెరువులను పూర్తి స్దాయిలో నింపి తాగునీటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మండవల్లి గ్రామ సర్పంచ్ మెండా జాన్సి అన్నారు. గ్రామంలోని కొండరాయి చెరువుకు నీటిని నింపే ప్రక్రియను సర్పంచ్ పరిశీలించారు. కుళాయిలకు సకాలంలో నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించా మన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు మెండా సురేష్‌బాబు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన

విశాలాంధ్ర-భీమవరం టౌన్: దసరా శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా పట్టణంలోని మెంటే వారి తోటలో వెలసిన శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తి భావంతో ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మద్దాల సత్యనారాయణ, సమతం తాతాజీ ,లీల,తోట భోగయ్య, కోడె యుగంధర్, ఏ ఎస్ రాజు, కొప్పర్తి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌హౌస్‌పై అవగాహన

విశాలాంధ్ర- ముసునూరు: ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలనుసారం ముసునూరు ఎస్ఐ యం.కుటుంబరావు ఆధ్వర్యంలో ఆమరువీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ముసునూరు జిల్లా పరిషత్ వున్నత పాతశాల విద్యార్థు లకు ఓపెన్‌హౌస్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయుధాలు పనిచేసే విధానం,కౌంటర్ ఫైల్ విధానం,పోలీస్ స్టేషన్ నందు నిర్వహించే కౌన్సిలింగ్ ఇలా పలు ఆంశాలతో కూడిన వివరాలు విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరాలు అవసరం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈతకోట భీమశంకర్ రావు (తాతాజీ) అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఈతకోట తాతాజీ పుట్టినరోజు పురస్కరించుకుని పట్టణంలో పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కామినేని ఆసుపత్రి సౌజన్యంతో గుండె వైద్య శిబిరం, లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య సిబ్బంది రీజియన్ చైర్ పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో తాతాజీ మాట్లాడుతూ వైద్యం ఖరీదుగా మారిన తరుణంలో పేదలకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నా యని అన్నారు. ఈ వైద్య శిబిరాలు ఉచితంగా మందులను పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయవలసి వస్తే తమ తరపున ఆర్థిక సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరిసే సోమేశ్వరరావు, గట్టెం మాణిక్యాలరావు, తన బుద్ధి భోగేశ్వర రావు, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర -కలిదిండి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలను పరిష్కరించాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి ఆర్డీవో ఖాజావలిలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు. శ్రీనివాసరావు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బళ్ల. రాజు కలసి దరఖాస్తు అందజేశారు. శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన లో మండలంలోని జగనన్న కాలనీ లకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించాలని, కలిదిండి మండలం శివారు ప్రాంతం కావడం వల్ల ఆక్వా రైతులకు సాగునీరు అందడం లేదని ఉప్పుటేరు లోని నీరుని ఉపయోగించుకుని చేపలు, రొయ్యలు సాగు చేసుకుంటున్నారని, మట్టగుంట న్యూడ్రైన్, యడవల్లి డ్రైన్, మట్టకొడు డ్రైన్‌లలో గుర్రపుడెక్క కిక్కిసు గడ్డితో పూడిపోయి నందున నీరు పారుదల లేక నీరు రాక ఆక్వా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఈ డ్రైన్లు పూడిక తీయాలని, యడవల్లి నుండి పెదలంక మీదుగా మూలంక వరకు రోడ్డు మరమ్మతు చేయాలని, గుర్వావాయిపాలెం నుండి సంతోషపురం వరకు రోడ్డు రిపేరు చేయాలని జాయింట్ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

ఓటర్ల జాబితా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు,ఓటర్ల జాబితా ప్రచురణలో అలసత్వం వహించకుండా ఓటర్ల జాబితాను త్వరగా పూర్తి చేయాలని కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దారు పి. నాగమణి బూత్ లెవల్ అధికారులకు,సూపర్వైజర్లకు శుక్రవారం ఓటర్ల జాబితాల రివిజన్ విషయమై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడలు అవసరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు, వైకాపా యూత్ లీడర్ కొట్టు విశాల్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14 అండర్ 17 బాల బాలికల క్రీడా పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి హాజరైన క్రీడాకారిణులైన బాలికల చేతుల మీదుగా క్రీడా పోటీలను ప్రారంభింప చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చదువు మనోవికా సాన్ని పెంచితే, క్రీడలు మనోధైర్యాన్ని, ఆత్మ బలాన్ని, దేహదారు ధ్యాన్ని ఇస్తాయన్నారు. క్రీడా కారులు ఆత్మవిశ్వాసంతో దేనినైనా సాధించ గలుగుతారన్నారు. బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనడం ద్వారా మానసిక ఎదుగుదలతో పాటు శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి మన పిల్లల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం ఆంధ్ర పేరుతో త్వరలోనే గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. విద్య తోపాటు క్రీడ ల్లోనూ ఉత్సాహంగా పాల్గొని రాణించాలని విద్యార్థిని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ వట్టి బుజ్జి, ఎన్ సి సి కోచ్ గణపతి రావు, ఎంఈఓ టీవీ రామకృష్ణ, పిఈటిలు చింతకాయల సత్యనారా యణ, బడుగు చంద్రశేఖర్, ఇంకా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-ఏలూరు: స్టార్టప్ ఇండియా పథకం కింద ఎస్సి, ఎస్టి కమ్యూనిటీ నుంచి మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సంబంధిత లబ్ధిదారులను గుర్తించి వారికి ఆయా రంగాల్లో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్టార్టప్ ఇండియా పథకం కింద అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకునేందుకు ఎస్సి, ఎస్టి కమ్యూనిటీల నుంచి మహిళా వ్యవస్థాపకులను ప్రోత్సహించేందుకు ఔత్సాహికుల లబ్ధిదారులను గుర్తించి వారికి పరిశ్రమల శాఖచే ఆయా రంగంలో శిక్షణ అందించి వారితో సమగ్రమైన డాక్యుమెంటేషన్ తయారుచేసి వాటిని సంబంధిత బ్యాంకర్లకు సమర్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పరిశ్రమల స్థాపనపై లభించు ప్రోత్సాహకాలు,అనుమతుల మంజూరు మొదలగు విధి విధానాలపై జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రచురించిన అవగాహన బ్రోచర్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం జె.నాగరాజా, డిప్యూటీ డైరెక్టర్ పి.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

మందలపు వారి వివాహ వేడుకకు పర్వతనేని

విశాలాంధ్ర-చాట్రాయి: తెదేపా కార్యకర్త మందలపు సీతారామయ్య కుమారుడి వివాహ వేడుకకు నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పర్వతనేని గంగాధర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.శుక్రవారం చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామానికి చెందిన మందలపు వారి వివాహ వేడుకకు హాజరైన గంగాధర్ నూతన వధూవరులు గోపాలకృష్ణ అనిత లను ఆశీర్వదించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కందుల కృష్ణ తెలుగు రైతు జిల్లా మాజీ కార్యదర్శి బొంతు సత్యనారాయణ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రాజా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

30 నెలల్లో నూజివీడు అభివృద్ధి చేసి చూపిస్తా

మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య

విశాలాంధ్ర -చాట్రాయి: ప్రస్తుత పరిస్థితిలో తనకు ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే కేవలం 30 నెలల వ్యవధిలో నూజివీడు నియోజకవర్గంలో సమగ్రమైన అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ శాసనసభ్యులు చిన్నం రామకోటయ్య పేర్కొన్నారు.సాదారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చిన్నం రామకోటయ్య నూజివీడు నియోజకవర్గంలో మరోసారి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఆత్మీయ సమ్మేళనం రాజకీయ చర్చ పేరుతో నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో తనకు పూర్వం నుంచి ఉన్న పరిచయాలను ఉపయోగించి మరోసారి రాజకీయ చర్చలు సమావేశాలు ప్రారంభించారు. నియోజకవర్గం పునర్విభజన జరిగిన తరువాత చాట్రాయి మండలం నూజివీడు నియోజకవర్గంలో కలసిన తరుణంలో ప్రజారాజ్యం పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం చేసి ఉద్యమం స్ఫూర్తి తో సేవాకార్యక్రమాలను నిర్వహించి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్రలు వేశారు . చిరంజీవి పార్టీ టికెట్ ఇవ్వకపోయినా ఆయన చేసిన సేవలతో తెదేపా అధినేత చంద్రబాబు దృష్టిని ఆకర్షించారు. అనూహ్యంగా సీటు సాధించుకొని విజయం సాధించి సంచలనాలను సృష్టించారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరోసారి రామకోటయ్య చూపు నూజివీడు నియోజకవర్గం పై పడింది. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన నిధుల కంటే రాష్ట్ర బడ్జెట్లో ప్రస్తుతం లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నందున తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కేవలం 24 నెలల నుంచి 30 నెలల కాలంలోనే విద్య వైద్యం ఉపాధి మౌలిక వసతుల కల్పన అన్ని రంగాలలో సమగ్రమైన అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన భరోసా కల్పించారు. స్వతంత్ర అభ్యర్థిగా వస్తున్న తనను బలపరచాలని తన మిత్రులను, శ్రేయోభిలాషులను, వివిధ రూపాలలో కలుస్తున్నారు చర్చలు జరుపుతున్నారు. దీనిలో భాగంగానే చాట్రాయి మండలంలోని జనార్ధన వరం ఆరుగురుపేట గ్రామాలలో వచ్చే ఆదివారం ఉదయం ఆత్మీయ సమ్మేళనం రాజకీయ చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చిన్నం రామకోటయ్య విశాలాంధ్రకు తెలిపారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్న తాను రాజకీయాలకు అతీతంగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో అంకాలగూడెం గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ జి. జె. విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంకాల గూడెం గ్రామానికి చెందిన తోట సురేష్ వద్ద నుండి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామాజిక తనిఖీ

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండలం లోని వేగేశ్వరపురం గ్రామంలో ఖరీఫ్ 2023 సీజన్‌లో నమోదు చేసిన పంట వివరములను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరసు రామారావు అధ్యక్షతన గ్రామ సభ లో చదివి వినిపించారు.. 29 వ తేదీ వరకు ప్రతి ఆర్.బి.కెల్లో పంట నమోదు జాబితా లు సామాజిక తనిఖీ నిమిత్తం ప్రచురించినట్లు తెలిపారు. పంట నమోదు వివరాలలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే రైతులు తమ అభ్యంతరాలను ఆర్.బి.కెల్లో గ్రీవెన్స్ రూపంలో సమర్పించి వివరాలను సరిచేయించుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ చివరి అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ. చంద్ర శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి రుచిత, సిబ్బంది పొసమ్మ , గౌతమి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గోకవరంలో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర- గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో దసరా వేడుకలు ముగింపు సందర్భంగా వీరబద్ధుని గద్దె వద్దగల కనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5000 మంది భక్తులు ఈ సందర్భంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుమారు పది రకాల వంటకాలతో అన్న సమరాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు బత్తుల నానాజీ , ముమ్మిడివరపు నారాయణ, పసుమర్తి బుజ్జి, వాకచర్ల రవి, డాక్టర్ పాలూరి బోసు బాబు, చోడిశెట్టి గోపీనాథ్ గుప్తా, బత్తుల వీరభద్రరావు, పసుమర్తి మరిడి రాజు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి వచ్చిన భక్తులందరికీ సంతృప్తిగా అన్న సమరాధ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ముసాయిదా ప్రచురణ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం మండలంలోని గ్రామ సచివాలయాల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ముసాయిదా ప్రచురణ చేసినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసిల్దార్ జి కనకరాజు శుక్రవారం తెలిపారు. ఈ ముసాయిదా ప్రకారం గ్రామంలోని ఓటర్లు వారికి సంబంధించిన లిస్టులో తమ తమ పేరు ఉన్నదీ, లేనిదీ సరిచూసుకుని, తప్పొప్పులు, మార్పులు చేర్పులు ఉన్నయెడల డిసెంబర్ 9వ తేదీ లోపు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏవేని మార్పులు, చేర్పుల కొరకు, మరేవేనీ ఆక్షేపణలుంటే ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారిని గాని, ఆయా గ్రామ సచివాలయాలలో బిఎల్ఓ లను గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

పిఎంపి నూతన కమిటీలు ఏకగ్రీవం

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి,బిక్కవోలు, రాయవరం మండలాల కమ్యూనిటీ ఫార్మా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసి యేషన్) నూతన కమిటీల నియామకం ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం రాయవరం వెలమ కమ్యూనిటీ భవన ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబు, జిల్లాకు కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. అనపర్తి , బిక్కవోలు మండల కన్వీనర్లుగా వాసంశెట్టి నాగేశ్వరరావు,కో కన్వీనర్లుగా డి సాయి రామారెడ్డి, నీలంశెట్టి శ్రీనివాస్,రాయవరం మండలం నూతన కమిటీ కన్వీనర్ గా నవుడు వెంకటరమణ, కన్వీనర్లు చింతా జగదీష్, ఎస్ శివ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాంబాబు, శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పి.ఎం.పి లు అందించవలసిన ప్రాథమిక వైద్యం కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో కె వి వెంకటరెడ్డి, పరంశెట్టి శ్రీనివాస్, కెవిజికెరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

విశాలాంధ్ర-పెరవలి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ బాబుతో నేను, బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రజలకు వివరిస్తూ పెరవలి మండలం,కానూరు అగ్రహారం గ్రామంలో శుక్రవారం ఇంటి ఇంటికి కరపత్రాలను పంచుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిప రాజు గుండాల నాగ మునేశ్వరావు,పెన్నాడ పుత్రయ్య, చెన్న చిన్న శ్రీను, హరిదాసు పెద్దోడు, గరగ పెత్తందారు, పిల్లి గోవింద్, పాకా చిన్న అంబటి వెంకటరమణ అనపర్తి వెంకట నారాయణ (జయ) గ్రామ తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర - నిడదవోలు : పట్టణంలోని నందిన ఫంక్షన్ హాల్లో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఓటర్ లిస్ట్ పరిశీలన , 1 వ తారీఖు నుంచి మొదలయ్యే బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణ,టెలిగ్రామ్ బాట్ లో అప్లోడ్ చేయడం గురించి ట్రైనింగ్ తదితర కార్యక్రమాల పై నియోజవర్గ క్లస్టర్, యూనిట్, బూత్ ఛార్జ్ లతో చర్చించారు. అనంతరం కార్యకర్తల నుండి వచ్చిన పలు అనుమానాలను నివృత్తం చెదు శేషారావు తగు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు భూపతి రాజు రవివర్మ, మండల టీడీపి అధ్యక్షులు వెలగన సూర్యారావు, పట్టణ టీడీపి అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ విశ్వరూప సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : మాదిగల అంతిమ విశ్వరూప సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఉత్తర కోస్తాంధ్ర, సీమాంధ్ర జిల్లాల ఇంచార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. జగ్గంపేట ఆశీర్వాద్ కాంప్లెక్స్ అవరణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 18వ తేదీన హైదరాబాద్ జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారని, ఆ సభను విజయవంతం చేయాలన్నారు. యువకులు ప్రతి ఇంటికీ కరపత్రాన్ని అందించి ఏబిసిడి వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటం గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ, ఎంఈఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కన్వీనర్ తాతపూడి వెంకటేష్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాచర్ల అప్పారావు మాదిగ, ఎంఅర్‌పిఎస్ జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్

విశాలాంధ్ర - కాకినాడ : "ఓపెన్ హౌస్" విద్యార్థినీ - విద్యార్థులకు అవగాహన ప్రదర్శనను కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ప్రారంభించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీసు శాఖ నిర్వహణతీరు, పోలీసు విధులకు అనుసంధానంగా ఉపయోగించే వ్యవస్థలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కాకినాడ అర్బన్, రూరల్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్నల సమక్షంలో ప్రారంభించారు. ఈ ఓపెన్ హౌస్‌లో కాకినాడ పట్టణం,సమీప ప్రాంతాల కళాశాల , పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కాగా వారికి జిల్లా ఎస్పీ స్వయంగా పోలీసు సిబ్బంది వారి విధి నిర్వహణలో వినియోగించే పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాల గురించి విద్యార్థులకు స్వయంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పిలు పరిపాలన పి శ్రీనివాస్, ఆర్మ్ రిజర్వ్ బి సత్యనారాయణ, ఎస్ఇ బి ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు పి మురళీ కృష్ణారెడ్డి, ఎస్ రాంబాబు, జయరాం ప్రసాద్‌లు ఆర్మ్ రిజర్వ్ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులు మరియు సిబ్బంది, కాకినాడ పట్టణ స్టేషన్‌ల ఇన్స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

రక్షణకరమైన అందానికి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆరోగ్యకరమైన రక్షణతో కూడిన అందాల సలహాలు ఇవ్వాలని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ నల్లమిల్లి మాధురిచే స్థానిక ఆర్టిసి బస్టాండ్ సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన మాధురీ స్కిన్, హెయిర్ అండ్ లేజర్ క్లీనికన్ను జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకర అందంద్వారా శరీరాన్ని పరిరక్షించుకునే నూతన సాంకేతిక వైద్య విధానం తొలిసారిగా కాకినాడలోకి అందుబాటులోకి రావడం శుభపరిణామమని అన్నారు. మారుతున్న యువత సరికొత్త ఆలోచనలకు అనుగుణంగా ఈ కాస్మటాలజీ లేజర్ క్లీనిక్ కాకినాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ మాధురిని అభినందించారు. కాస్మోటాలజి క్లీనిక్ అధినేత డాక్టర్ మాధురి మాట్లాడుతూ నేటిసమాజంలో వాతవరణ కాలుష్యం బాగా పెరిగిపోయిన తరుణంలో జంక్ ఫుడ్స్, మానసిక ఒత్తిడులవల్ల మనిషి అందంతోపాటు అనారోగ్యానికి గురౌతున్నారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిధులు ఎస్పి సతీష్ కుమార్, ప్రముఖ డెర్మటాలజిస్ట్ దామెర రామారావును మాధురి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసారు. కవ స్థల సాయిధృతి ఫౌండేషన్ ట్రస్ట్ డైరక్టర్లు ఎస్. ప్రతాపరెడ్డి, ప్రముఖ ఆడిటర్ యు మురళి కృష్ణ, డాక్టర్ శుభశేఖర్ రెడ్డితో పాటు నగరంలో ఉన్న ప్రముఖ వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవంబర్ 3న పరీక్ష పగడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - శంఖవరం : నవంబర్ మూడవ తేదీన జరిగే పరీక్షలను ఉపాధ్యాయులంతా కలిసి పగడ్బందీగా నిర్వహించాలని శంఖవరం మండల విద్యాశాఖాధికారి సూరిశెట్టి వెంకట రమణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం శంఖవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. 3, 6, 9 తరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్, అంగ్ల మాధ్యమంలో ఓఎంఆర్ ప్రశ్నా పత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించేలా విద్యార్థులకు ఎప్పటినుంచే తర్ఫీదు నివ్వాలని ఎంఈఓ కోరారు. మూడో తరగతి విద్యార్థులకు మూడవ తరగతి, ఆరో తరగతి విద్యార్థులకు 5వ తరగతి 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్ చదివించాలని శంఖవరం 2వ ఎంఈఓ గోవిందు అన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్ఈఓ2 గోవిందు, పెదమల్లాపురం హెచ్ఎం కెవిఎస్ మూర్తి, కత్తిపూడి హెచ్ఎం ఆకెళ్ళ శ్రీనివాస్, రాంబాబు, కె వెంకటేశ్వరరావు, మూర్తి, శారదా ప్రిన్సిపల్ బోనగిరి శ్రీనివాస్, శివకుమార్, సీఆర్పీలు డి రాజబాబు, ఎస్ నాని బాబు, స్వర్ణలత, నాగరాజు, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

పంట నమోదులో ప్రతి రైతు పేరు సరిచూసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : పంట నమోదు ప్రక్రియలో ప్రతి రైతు విధిగా తమ పేరు ఉందో లేదో సరి చూసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత సూచించారు. కిర్లంపూడి మండల పరిధిలోని 2023 ఖరీఫ్ పంట నమోదుకు సంబంధించిన సోషల్ ఆడిట్ లిస్టులను పలు గ్రామల సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ పంట నమోదుకు సంబంధించిన పేర్లు జాబితాను పెట్టడం జరిగిందన్నారు. రైతు తమ పేరు జాబితాలో ఉందో లేదో గమనించుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మళ్ల రామకృష్ణ, పలువురు రైతులు ఉన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : స్థానిక ఎమ్మార్సీ భవనంలో చెకుముకి సైన్స్ సంబరాలు గోడ పత్రిక ఆవిష్కరణ జరిగింది. పిఠాపురం మండలం ఎంఈఓ నారాయణదాసు జన విజ్ఞాన వేదిక-చెకుముకి సైన్స్ సంబరాలు 2023 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని కొనియాడారు. ప్రతి విద్యార్థిలోనూ సైన్స్ పట్ల అవగాహన కలిగినప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జరిగే చెకుముకి సైన్ సంబరాల్లో పిఠాపురం మండలంలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మరియు ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులందరూ పాల్గొనేలా యాజమాన్యాలు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

'దీపావళి షాపోత్సవ్' 2023ని ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశంలో స్వదేశీయంగా అభివృద్ధి చెందిన ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ యొక్క డిజిటల్ బీ 2బీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ అయిన ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్, ఈరోజు తమ బీ2బీ సభ్యుల కోసం దీపావళి షాపోత్సవ్‌ను అక్టోబర్ 25 నుండి నవంబర్ 12, 2023 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'బోలో ఫైదే కి బోలి' అనే ట్యాగ్‌లైన్‌తో జరిగే ఈ వార్షిక విక్రయం మొత్తం 26 స్టోర్‌లలో అలాగే ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ యాప్‌లో అందుబాటులో ఉంటుంది. తమ ట్యాగ్‌లైన్‌కు అనుగుణంగా, దీపావళి షాపోత్సవ్ విభిన్న విభాగాలలో ఈ సీజన్‌లో అతిపెద్ద డీల్‌లను వేడుక చేసుకుంటుంది. ఈ సంవత్సరం, గృహ%ఉ%వంటగది ఉపకరణాలు, బహుమతి మరియు పండుగ అలంకరణ వస్తువులు వంటి కొత్తగా ప్రారంభించబడిన కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించింది. పండుగ ఉల్లాసాన్ని మరింత పెంచేందుకు, రోజువారీ ఫ్లాష్ డీల్‌లు ప్లాన్ చేయబడ్డాయి, ఇందులో బ్రాండ్‌లు సభ్యులకు 2 కిలోల చక్కెర అనేక ఇతర వస్తువులను అందిస్తాయి. అదనంగా, కిరాణా సభ్యులు లక్కీ డ్రా ఆఫర్‌లో భాగంగా సరికొత్త మహీంద్రా థార్, మొబైల్ ఫోన్‌లు, బంగారం మరియు వెండి నాణేలతో సహా అద్భుతమైన బహుమతులను గెలుచుకునే అవకాశం ఉంటుందని ఫ్లిప్కార్ట్ ప్రతినిధి చెప్పారు.

ఫాస్ట్రాక్ నుంచి పార్టీ వేర్ వాచ్ వీవైబీ

విశాలాంధ్ర-రాజమండ్రి: భారతదేశపు ఐకానిక్ యూత్ బ్రాండ్, ఫాస్ట్రాక్, ఇటీవల యువతుల కోసం ప్రత్యేకంగా ఒక సబ్-బ్రాండ్ అయిన వీవైబీని ప్రారంభించింది. చిక్, స్టైలిష్ మరియు వినూత్నమైన వీవైబీ ట్రెండ్‌లు తాజా డిజైన్‌ల ప్రపంచాన్ని ఆస్వాదించే ఫ్యాషన్‌వాదులకు అంకితం చేయబడింది. ప్రస్తుత ఫాస్ట్-ఫ్యాషన్ ప్రాధాన్యతలపై దృష్టి సారించి, వీవైబీ బై ఫాస్ట్రాక్ అన్ని రకాల పార్టీల కోసం అందాన్ని మెరుగుపరిచే అద్భుతమైన, విలువైన పీస్ ల కోసం వెతుకుతున్న వారికి అందిస్తుంది. మొదటి కలెక్షన్ డ్రాప్‌లో 71 ఉత్కంఠభరితమైన డిజైన్‌లు ఉన్నాయి. విభిన్నమైన మరియు అలంకరించబడిన పట్టీలు, కొత్త ప్లేటింగ్ రంగులు మరియు ఆసక్తికరమైన డయల్ ఆకారాల శ్రేణితో, బ్రాండ్ ప్రతి మూడ్ మరియు క్షణానికి వాచ్ ఉండేలా చేస్తుంది. అన్నింటికంటే అగ్రగామిగా, ఈ వాచీలు సరసమైన ధర శ్రేణి లో రూ. 1250 నుండి రూ. 2960 మధ్య లభిస్తాయి. వీవైబీ విడుదలతో, ఫాస్ట్రాక్ తన పోర్ట్‌ఫోలియోను కొత్త డిజైన్లతో విస్తరింపజేస్తుంది, ఇది ఫ్యాషన్-ఫార్వర్డ్ యువతుల కోసం బ్లింగ్ టచ్ కలిగి ఉంది, వారి స్వేచ్ఛా స్ఫూర్తితో కూడిన పార్టీ వైబ్‌ను అత్యంత విశ్వాసంతో ప్రదర్శించేలా వారిని ప్రోత్సహిస్తుంది.